క్లుప్తంగా

30న వాసవీమాతకు ప్రత్యేక పూజలు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలో వెలసిన వాసవీమాత ఆలయంలో ఈ నెల 30న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌శెట్టి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆషాఢశుద్ధ ద్వాదశి శుక్రవారం అమ్మవారు శాకాంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారని అన్నారు. ఉదయం 10.30 గంటలకు వాసవీ అష్టోత్తర శతనామ పూజ, లలితా సహస్రనామాలు, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు అర్చకస్వామి వినోద్‌కౌశిల్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు 108 మల్లెపూలు, గోరింటాకు తెచ్చుకోవాలని కోరారు.

దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

ధరూరు: దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, దళితబంధు పథకం అమలు చేయాలని దళిత జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడిగా పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కమిటీలో స్థానం కల్పించాలన్నారు. ఎలాంటి జీతాలు లేకుండా దశాబ్దాల తరబడిగా పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం పథకాలు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల నోటిఫికేషన్ జారీ



గట్టు: మండల కేంద్రంలోని గోపికృష్ణ ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం ఎన్నికల అధికారి మన్నెశ్వరి విడుదల చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీతో పాటుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. సంఘంలో 287 మంది ఓటర్లు ఉన్నట్లు సభ్యులు తెలిపారు. ఈ నెల 30, వచ్చే నెల 1,3 తేదీల్లో నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు వివరించారు. 4న నామినేషన్ల పరిశీలన, 5న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజున 5 గంటల తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. 10న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గట్టు గ్రామ పంచాయతీలో పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత లెక్కింపు ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

మేలు రకం మొక్కలు నాటాలి



ధరూరు: రైతులు సాధారణ పంటలతో పాటు చీనీ, మేలు రకం జాతి తోటలు సాగు చేసుకుంటే మంచి దిగుబడులతో పాటు లాభాలను గడించవచ్చని శాస్త్రవేత్త, సంహిత క్రాప్ కేర్ సీఈఓ గున్నం శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పారుచర్ల గ్రామ శివారులోని రైతు సురేందర్ రెడ్డి పొలంలో సాగు చేసిన చీనీ తోటలో ఈ ప్రాంత రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఎప్పుడూ వరి, వేరుశనగ, పత్తి వంటి పంటలే కాకుండా పండ్ల తోటల సాగుపై కూడా దృష్టిసారిస్తే మంచి లాభాలను పొందవచ్చన్నారు. రైతులు ప్రభుత్వ సబ్సిడీ, మెయింటెన్స్ చార్జెస్ కింద ఉపాధి ద్వారా కొంత సొమ్మును అందిస్తుందన్నారు. నడిగడ్డ ప్రాంతంలో ఈ మధ్య కాలంలో పండ్ల తోటల సాగుపై రైతులు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్నారు. అలాగే మామిడి, బొప్పాయి వంటి తోటలను తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవచ్చన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులు ఉదారత



అయిజ: మేడికొండ, అయిజ బీటీ రోడ్డు కొన్ని సంవత్సరాలుగా గుంతలతో అధ్వానంగా ఉన్న నేపథ్యంలో మేడికొండ కాంగ్రెస్ నాయకులు స్పందించి మొర్రం కొట్టించారు. మంగళవారం మేడికొండ రోడ్డుపై కాంగ్రెస్ నాయకులు రఫి, సిద్దులు రూ.60 స్వంత ఖర్చులతో గుంతలను పూడ్చి వేశారు. అయిజ మేడికొండ వైపు తుపత్రాల, పలికల్లు, రాజాపురం, బైనపల్లె గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. మొత్తం 60 ట్రిప్పుల మొర్రంతో గుంతలను పూడ్చివేశారు.

మేటీలు లేక అవస్థలు



ఉండవెల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- సాధారణ కూలీలుగా మేటీలు
- ఫీల్డ్ అసిస్టెంట్లకు పెరిగిన పని ఒత్తిడి

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే కూలీల హాజరు మేటీలే చూసుకునేవారు. ప్రస్తుతం వారు సాధారణ కూలీలుగా వ్యవహరించడంతో ఫీల్డ్ అసిస్టెంట్లే నేరుగా కూలీల హాజరు వేసుకుంటున్నారు. గతంలో శ్రమశక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గ్రూపులుగా ఉండి మేటీనే హాజరు వేసుకుని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేవారు. ప్రస్తుతం శ్రమశక్తి పథకాన్ని తొలగించగా దాదాపు సీనియర్ మేటీలను కూలీలుగానే పరిమితం చేయడంతో ఉపాధిహామీ పథకానికి కూలీల శాతం తగ్గింది. కూలీలకు రూ.274 ఇస్తామని తెలిపి కొలతలు వేసుకుని తీసుకోవాలని అధికారులు కూలీలకు సూచించడంతో చదువురాని వారు కొలతలు వేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

హాజరుకు ఇబ్బందులు..

మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు మొత్తం 4 వేలకు పైగా కూలీలు ఉన్నారు. అందులో 1500 మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. మొత్తం 12500కు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి ఏడాది జాబ్ కార్డులను పెంచి కూలీలను పెంచే దిశగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో కూలీల శాతాన్ని పెంచేందుకు గ్రామ సభల ద్వారా సమావేశాలు నిర్వహించి సమాచారం అందిస్తున్నారు. మేటీలు లేకపోవడంతో కూలీల హాజరుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామంలో 50 గ్రూపులకు దాదాపు 25 మంది మేటీలు ఉండగా మండలం మొత్తం 200 మంది మేటీలు పనిచేసేవారు. ప్రస్తుతం మేటీల వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ఫీల్డ్ అసిస్టెంట్లు లేనిచోట..

మండలంలో 16 గ్రామ పంచాయతీలకు గాను 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. ఇటిక్యాలపాడు, బైరాపురం, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల-1, 2 గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో సీనియర్ మేటీలను ప్రజా ప్రతినిధుల పలుకుబడితో ఏర్పాటు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై పని ఒత్తిడి..

మేటీలు సాధారణ ఉపాధి కూలీగా మారడంతో ఫీల్డ్ అసిస్టెంట్లపై పనిభారం అధికమైంది. దీంతో ఉపాధి కూలీల బిల్లులను సరైన సమయానికి నమోదు చేయలేకపోతున్నారు. కొలతల ప్రకారం లెక్కలు తప్పులు దొర్లుతున్నాయి. కూలీల హాజరు శాతం, క్రీడా ప్రాంగణాల బిల్లులు నమోదు సరిగ్గా చేయలేకపోతున్నారు. ఎండిపోయిన మొక్కలను తొలగించకపోవడం, నర్సరీలో మొక్కలను పట్టించుకోవడం, హరితహారంలో మొక్కలు నాటిన వద్ద ఉన్న కలుపును తొలగించకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు మాత్రం విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టీఏలకు, నోటీసులు అందజేశారు.



సామాజిక తనిఖీలో అధికారులు

సాధారణ కూలీల్లా మేటీలు

గతంలో ఉపాధి కూలీల హాజరు, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో మేటీలు పనిచేసేవారు. ప్రస్తుతం వారి స్థానంలో ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేస్తున్నారు. మేటీలు సాధారణ కూలీగానే పనిచేస్తున్నారు.

– విజయ్ శంకర్, ఏపీఓ ఉండవెల్లి

కొనసాగుతున్న భాగవత పారాయణం



భాగవత పారాయణం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం భాగవత పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భాగవత సప్తాహ కార్యక్రమంలో భాగంగా శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శిష్య బృందం సభ్యులు ఆలయంలో నాల్గో రోజు సప్తమస్కంధం, అష్టమస్కంధంతో పాటు నవమస్కంధంలో వైవస్వత మనువంశ చరిత్ర వరకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, ఆలయ అర్చకులు, భక్తులు, తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి వివరాల ప్రకారం బర్దపేటకు చెందిన జహంగీర్‌ను అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన చిన్న అకారణంగా దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. అయితే ఇద్దరి మధ్య పాత కక్షలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితం



మల్దకల్‌లో గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వరూపరాణి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితమని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య మహిళపై అవగాహన కల్పించారు. అలాగే గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన బైక్

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఉత్తర ఫీడ్స్ కంపెనీ ఎదురుగా ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం మంగళవారం జాతీయ రహదారిపై బెంగుళూరుకు వెళ్తునన లారీ టైర్ పంక్చర్ అయ్యి ఆగింది. అలంపూర్ మండలం లింగన్‌వాయి గ్రామానికి చెందిన కల్యాణ్, మధు, వెంకటేష్ ముగ్గురు బైక్‌పై కర్నూల్ వైపు ప్రయాణిస్తుండడంతో ఆగి ఉన్న లారీని ఢీ కొన్నారు. బైక్‌పై ఉన్న కల్యాణ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్ ధరణికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాజోళి(మానవపాడు): ఇంటి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.15 లక్షలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం మానవపాడులో ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ధరణికి అందజేశారు. ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.3 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరిపోదన్నారు. కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. సిమెంట్, రాయి, ఇసుక ఇంటి సామగ్రి ధరలు భగ్గుమంటుంటే ప్రభుత్వం ఇచ్చే అరకొర డబ్బులతో ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మానవపాడులో ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమిని అర్హులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు రాజు, సీఐటీయూ నాయకుడు మలిక్ బాషా, రంగ, అచ్చన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధికి సన్మానం



అయిజ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నూతనంగా నియామకమైన మాస్టర్ షేక్షావలి ఆచారికి కార్యకర్తలు మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి అయిజకు విచ్చేసిన ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనసేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా

రాజోళి(మానవపాడు): మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని డాక్టర్ రిజ్వానా అన్నారు. మండల కేంద్రం మానవపాడులో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 68 మంది మహిళలకు వైద్య పరీక్షలు, 26 మందికి రక్త నమూనాలు సేకరించారు. గర్భ, లైంగిక, నోటి క్యాన్సర్, మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్ లకు సంబంధించిన పలు పరీక్షలు చేసినట్లు వైద్యురాలు తెలిపారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో చంద్రన్న, సత్యనారాయణ, సంధ్యారాణి, తిరుమల్ రావు, సోని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో అంబాభవాని మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వరాహిని దేవిగా పూజిస్తూ మహిళలు విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి, పసుపు కుంకుమ, చీరలను సమర్పించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజారోగ్యంపై దృష్టి



కొత్త బీపీ చెకప్ మిషన్లను అందజేస్తున్న జిల్లా వైద్య అధికారులు

ధరూరు: వైద్య శాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరు ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మెడికల్ ఆఫీసర్ శరణ్య, జిల్లా ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన నెల వారి సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా బీపీ ఆపరేటర్లను అందిస్తోందని దీనిని ఒకసారి చార్జ్ చేసుకుంటే 400 మందికి బీపీ చెక్ చేయొచ్చన్నారు. 30 ఏళ్ల పైబడిన వారందిరికి విధిగా బీపీ చెక్ చేయాలని సూచించారు. ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసుకుని చెకప్‌లు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ సందర్భంగా కొత్త బీపీ చెకప్ మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మక్బూద్, సీహెచ్ఓ ఆనందయ్య, ఎన్‌సీడీ సూపర్‌వైజర్ హీర్యానాయక్, నర్సింహులు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు జీవిత నైపుణ్యాలు అవసరం



హాజరైన కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు

ధరూరు: బాలికలు జీవిత నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థానంలో స్థిర పడేందుకు ఎంతగానో దోహదపడతాయని వాయిస్ ఫర్ గర్ల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూషా భరద్వాజ్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్‌జీఓ సభ్యులు మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు ఆర్థిక అసమానతలు, సామాజిక అసమానతలు, లింగ వివక్ష, సంస్కృతి – సమాజం, బాలికల యుక్త వయస్సు, రుతుక్రమ ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు, హింస, విద్య – ప్రాధాన్యత అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. షెడ్యూల్డు తెగల పిల్లలకు నాణ్యమైన విద్య, విభిన్న రంగాల్లో ఉపాధిని పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను వారికి అందించడం కోసం అకాడమిక్ – నాన్ అకాడమిక్ విద్య రెండింటికీ ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. 10 రోజుల పాటు 'హర్ వాయిస్'ని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ భాగ్యశ్రీ, ఫీల్డ్ కో ఆర్డినేటర్ మనీషా పాలడుగు, కౌన్సెలర్స్ ప్రియాంక, సామిక, మనూష, శిరీష, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు



ఇటిక్యాలపాడు నుంచి తక్కశిలకు వెళ్లే రహదారి

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు నుంచి తక్కశిల శివారు వరకు నిర్మించిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏడాది కాకముందే రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల సౌకర్యార్థం రోడ్డుకు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

కేటీదొడ్డి: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటి సర్వే పూర్తి చేసి ఓటరు జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ సుందర్ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ బీఎల్ఓలతో ఓటర్ వేరిఫికేషన్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఫారం 6 ద్వారా ఓటరు నమోదు చేయాలన్నారు. జూలై 13వతేదీ వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఆర్ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అలంపూర్‌లో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అలంపూర్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మంగళవారం పట్టణంలోని బ్రాహ్మణ వీధి, అక్బర్‌పేట, సంతోషనగర్ కాలనీల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం అక్బర్‌పేట కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని ఆరుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. మరో ఆరు మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చేరారని అంగన్‌వాడీ టీచర్ పేర్కొన్నారు. బ్రహ్మణ వీధిలోని ఆయా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపైకి వస్తుందని ఆ కాలనీ ప్రజలు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. వీరితోపాటు కౌన్సిలర్ సుష్మారావు, మున్సిపల్ ఏఈ మేఘనాథ్ గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు శేఖర్, లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామేలు, మరియమ్మ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

శాంతినగర్: వచ్చే నెల 1వ తేదీన నిర్వహించే గ్రూప్–4 పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ బోధిని కళాశాల, రాఘవేంద్ర పాఠశాల, ఎల్ఎస్ఆర్ కళాశాల, శివశివాని పాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్లను ఆయన సందర్శించారు. ఐదు సెంటర్లలో మొత్తం 1,360 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తహసీల్దార్ తెలిపారు. అభ్యర్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్ఐ ఆంజనేయులు, ఎంఈఓ నర్సింహులు ఉన్నారు.

నేడు సినీనటి మంచు లక్ష్మి రాక

గద్వాల: జిల్లాలో అక్షరాస్యత పెంపు, విద్యాభివృద్ధిలో భాగంగా సినీనటి మంచు లక్ష్మి పలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహిస్తారని ఆమె పీఆర్వో రాజ్‌కమల్ తెలిపారు.

కౌలు రైతులను గుర్తించాలి

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించాలని రైతాంగ సమితి, వివిధ పార్టీల నాయకులు అన్నారు. మంగళవారం కౌలు రైతుల అవస్థలపై ప్రజావేదిక పేరుతో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బ్యాంకు రుణాలు, రైతు బంధు ఇవ్వాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో రైతు కుటుంబానికి రూ.6వేలు ఇవ్వాలని, గుర్తింపు కార్డు లేని కౌలురైతులకు జేఎల్‌జీ పద్ధతిని వర్తింపచేయాలన్నారు. సమావేశంలో రైతు స్వరాజ్ వేదిక, రైతాంగ సమితి , వివిధ పార్టీల నాయకులు రవి, వెంకటయ్య, గోపాల్, సత్యారెడ్డి, ఆంజనేయులు, జమాల్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనరు ఎక్బాల్‌పాషా పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్, ఎంఈఓ



గట్టులో క్విజ్ పోటీ విజేతలతో ఎంఈఓ, మేనేజర్

అలంపూర్: ప్రతి ఒక్కరికి డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హరిజనవాడ పాఠశాలలో ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 7 పాఠశాలల నుంచి 14 మంది విద్యార్థులు హాజరయ్యారు. జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్యాతూర్ విద్యార్థులు రేవతి, ఎండీ ఆదిల్ ప్రథమ స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ విద్యార్థులు సందీప్, శైలేష్, మూడవ స్థానంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు వేదసాహితీ, శిరీషలు నిలిచారు. విజేతలకు బ్యాంక్ మేనేజర్ సురేంద్రబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం బాలజీ కృష్ణకుమార్, నాగరాజు, మాబుసాబ్ తదితరులు ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మాచర్ల యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేసినట్లు బ్యాంక్ మేనేజర్ సురేష్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక పొదుపు, డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండారెడ్డి, కౌన్సిలర్ రవిసాగర్, కాంప్లెక్స్ హెచ్ఎం ఓబులేష్, ఆరగిద్ద హెచ్ఎం జహీర్ బేగ్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శీలన్న, నర్సింహులుగౌడ్, అశోక్ పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూబీఐ బ్యాంకు మేనేజర్ గంగాధరం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మల్దకల్‌లో..